సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం ׀ 30 ׀ ఏప్రిల్ ׀ 2024



అంబాజీపేట సభలో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్న సీఎం జగన్. చిత్రంలో ఆ పార్టీ అభ్యర్థులు పినిపే విశ్వరూప్ (అమలాపురం), విప్పర్తి వేణుగోపాలరావు (పి.గన్నవరం)



అంబాజీపేటలో సీఎం జగన్ సభకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం

మండుటెండలోనూ..
మహాజనసంద్రం

జగన్ వచ్చిన వేళ.. ఊరంతా పండగ

- అంబాజీపేటలో సీఎం జగన్ ఎన్నికల ప్రచారం
- జన వరద గోదావరిలా సభా ప్రాంతం
- జగన్ ప్రసంగానికి కేరింతలు, చప్పట్లు

మిట్ట మధ్యాహ్నం.. నింగి నుంచి నిప్పులు కురిపిస్తున్న సూరీడు.. 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత.. బయటకు వెళ్తే భగ భగలు.. రోడ్డు మీదకు వస్తే.. ఒంటిపై అగ్గిరవ్వలు రాసుకున్నట్టుగా వేడి గాలి.. ఒకటే ఉక్కపోత.. ఒంటి నుంచి ధారాళంగా కారిపోతున్న చెమటలు.. ఇలాంటి వాతావరణంలో ఎంతటి వారికైనా బయటకు రావడం దుస్సహమే అవుతుంది.కానీ, తమ ప్రియతమ నేత, వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అరుదెంచిన వేళ.. తరలివచ్చిన అశేష జనవాహినిని చండప్రచండంగా చెలరేగిన మధ్యందిన మార్తాండుడు సైతం అడ్డుకోలేకపోయాడు. సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభ నిర్వహించిన వేళ.. కోనసీమ జిల్లా అంబాజీపేట సెంటర్.. ఆ మండుటెండలో మహాజనసంద్రాన్ని తలపించింది.



మేమంతా సిద్ధం: వైఎస్సార్ సీపీ విజయానికి రెడీ అంటున్న జనం



జయహో జగనన్నా..: ఓ అభిమాని రణనినాదం



జై జగన్: యువత ఆనందోత్సాహం

సాక్షి, అమలాపురం/మామిడికుదురు/అంబాజీపేట: గోదావరికి ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకూ వరద వస్తుంది. చిన్నగా మొదలై మహోగ్ర రూపం దాలుస్తోంది. ఈసారి మాత్రం జగనాభిమాన వరద ఏప్రిల్‌లోనే వచ్చింది. ఉదయం నెమ్మదిగా మొదలైన జన వరద మధ్యాహ్నం ఒంటి గంటకు మహోగ్ర రూపం దాల్చింది. మహాజనసంద్రంలా అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్‌ను ముంచెత్తింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట వచ్చిన వేళ.. ఈ ప్రాంతం జన జాతరను తలపించింది. వశిష్ట, వైనతేయ, గౌతమి గోదావరి పాయల ప్రవాహంతో పునీతమైన ఈ ప్రాంతం జనసంద్రమే అయ్యింది. కోనసీమ నడిబొడ్డున.. పి.గన్నవరం నియోజకవర్గంలోని కొబ్బరి వ్యాపార కేంద్రమైన ఈ ప్రాంతం నుంచి సీఎం జగన్ ఎన్నికల సమర శంఖం పూరించారు. ఆయన ప్రసంగానికి కేరింతలతో చప్పట్లు కొడుతూ, అశేష జనవాహిని తమ ఆమోదం తెలిపింది. చంద్రబాబు 2014 ఎన్నికల హామీలను గుర్తు చేస్తూ జగన్ వేసిన సెటైర్లకు జనం హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ నినదించారు.

జగనాభిమానం ముందు చిన్నబోయిన భానుడు

వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన సభలో అశేష జనవాహినిని ఉద్దేశించి జగన్ ప్రసంగించారు. జంక్షన్‌కు ఒకవైపు సభ పెట్టారు. సభా స్థలం సరిపోకపోవడం.. చుట్టూ ఉన్న భవనాలు ఎక్కకుండా పోలీసులు ఆంక్షలు పెట్టడంతో మెయిన్ రోడ్డుతో పాటు ఎదురుగా పెద్ద వీధి రోడ్డులోని కొంత భాగం జనంతో నిండిపోయింది. నిప్పులు కురిపించిన భానుడి తీక్షణత సైతం ప్రజాభిమానం ముందు చిన్నబోయింది. సంక్షేమ సారథి, అభివృద్ధి ప్రదాత అయిన సీఎం జగన్‌కు వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. సభకు వచ్చిన వారితో అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్ నిండిపోయింది. నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో కూడిన వైఎస్సార్ సీపీ జెండాలతో ఆ ప్రాంతం కొత్త కళను సంతరించుకుంది. నియోజకవర్గం నలుమూలల నుంచీ వేలాదిగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తరలివచ్చారు. ఒకవైపు సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నా లెక్క చేయకుండా సీఎం జగన్‌ను కన్నులారా చూసేందుకు ఉదయం పది గంటల నుంచే అక్కడే వేచి ఉన్నారు. అప్పుడు మొదలైన జనం రాక సీఎం వచ్చే సమయానికి మరింత పెరిగింది. మధ్యాహ్నం 1.04 గంటలకు సీఎం జగన్ ఇక్కడకు చేరుకున్నారు. 2.37 గంటలకు ఆయన సభ ముగిసింది. అప్పటి వరకూ మండుటెండలో మహిళలు, వృద్ధులు, యువతీ యువకులు జగన్‌ను చూస్తూ అలానే ఉండిపోవడం విశేషం.

కాన్వాయ్ వెంట జనప్రవాహం

హెలిప్యాడ్ ఏర్పాటు చేసిన అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి సభా స్థలి వరకూ సీఎం జగన్ కాన్వాయ్ వెంట జనం అశేషంగా పరుగులు తీశారు. జైజగన్.. జైజై జగన్.. జై వైఎస్సార్ సీపీ నినాదాలతో హోరెత్తించారు. ఇసుక వేస్తే రాలనంతగా జనం రావడంతో సభా ప్రదేశం కిక్కిరిసిపోయింది. త్వరలో ఎన్నికలు జరగనున్న క్రమంలో నిర్వహించిన సీఎం ప్రచార సభకు ఊహించనంతగా జనం రావడమే కాకుండా.. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో నినాదాలు, చప్పట్లతో పెద్ద ఎత్తున తమ మద్దతు తెలిపారు. ఇది చూసిన నాయకులు ఎన్నికల్లో తమ విజయం ఖాయమనే ధీమాకు వచ్చారు.

ఎక్కడా తగ్గేదేలే..

రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలు గెలవాల్సిందే.. ఎక్కడా తగ్గేదే లేదు. గెలవడానికి మనం సిద్ధమేనా?' అని జగన్ ప్రశ్నించినప్పుడు, సిద్ధమే అని జనం ముక్తకంఠంతో పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గెలుపు విషయంలో ఎక్కడా తగ్గేదే లేదని సీఎం జగన్ అన్నప్పుడు జనం నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. 'ఫ్యాన్ ఇంట్లో ఉండాలి? చెడు చేసిన సైకిల్ వీధిలో ఉండాలి. తాగేసిన గ్లాస్ షింక్‌లోనే ఉండాలి' అన్నప్పుడు జనం అవును.. అవును అంటూ పెద్ద ఎత్తున స్పందించారు.

'చంద్ర'ముఖిని నిద్ర లేపడమే..

బాబును నమ్మడమంటే చంద్రముఖిని నిద్ర లేపడమే నని.. ఓ సినీ క్యారెక్టర్‌ను ప్రస్తావిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించడం జనాన్ని మెప్పించింది. 'చంద్రబాబును నమ్మితే.. వదల బొమ్మాళీ వదలా అంటూ ప్రతి పేదవాడి ఇంటికి వచ్చి, తలుపు తట్టి రక్తం తాగేందుకు ఆ పసుపుపతిని ఆహ్వానించడమే' అంటూ సీఎం జగన్ విసిరిన పంచ్ డైలాగులకు ప్రజలు కేరింతలు కొట్టారు. ఆడబిడ్డ పుడితే రూ.25 వేలు డిపాజిట్ చేస్తామని హామీ ఇచ్చారని, ఇంటికో ఉద్యోగం, లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలు అమలు చేశారా? అని సీఎం ప్రశ్నించినప్పుడు మోసాల బాబు ఏమీ చేయలేదని యువత కేరింతలు కొడుతూ.. సీఎం సీఎం సీఎం జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు.

పండగ సందడి

జగన్ రాకతో అంబాజీపేట సెంటర్‌లో పండగ వాతావరణం నెలకొంది. ఈ సెంటర్‌లో సంక్రాంతికి ప్రభల తీర్థం.. గ్రామంలో అమ్మవారి జాతరలు జరుగుతూంటాయి. ఆ సమయంలో నెలకొనే సందడే జగన్ వచ్చిన సమయంలో కనిపించింది. కేరళ చెండా వాయిద్యాలు.. తీన్‌మార్ మోతలతో హోరెత్తించారు.

వేణు అన్న మంచివాడు

'పి.గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా వేణన్నను (విప్పర్తి వేణుగోపాలరావు) ఎంపిక చేశాను. వేణన్న మంచివాడు. సౌమ్యుడు. ఇరిగేషన్ ఇంజినీరుగా ఈ జిల్లాకు ఎనలేని సేవ చేశాడు. మీకు ఎమ్మెల్యేగా మంచి సేవలందిస్తాడు. ఇప్పటికే జెడ్పీ చైర్మన్‌గా సేవలు చేస్తున్నాడు. అతనిని గెలిపించండి' అని సభికులను సీఎం జగన్ కోరారు. అలాగే 'రాజోలు ఎమ్మెల్యేగా సేవలందించిన రాపాక వరప్రసాదరావును పార్లమెంట్ స్థానానికి మీ ముందు ఉంచాను. అతను మంచివాడు. అతనిని కూడా గెలిపించండి' అని జగన్ కోరారు.

సీఎంకు ఘన స్వాగతం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. ఆయనకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావుతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ పదవులు పొందిన వారు స్వాగతం పలికారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ నేతల చేరిక

పి.గన్నవరం నియోజకవర్గంలో టీడీపీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు ప్రముఖులు టీడీపీకి రాజీనామా చేసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కోనసీమ టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మందపాటి కిరణ్‌కుమార్, జిల్లా టీడీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మందపాటి అనితా శుభజ్యోతి దంపతులు అంబాజీపేట ఎన్నికల బహిరంగ సభలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం జగన్‌ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కలిశారు. కిరణ్ కుమార్ దంపతులకు సీఎం వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

సీఎం పర్యటన సాగిందిలా...

- **1.04 :** హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎం జగన్
- **1.29 :** సభా వేదిక వద్దకు చేరిక
- **1.35 :** సీఎం జగన్ ప్రసంగం ప్రారంభం
- **2.07 :** సీఎం ప్రసంగం ముగింపు
- **2.37 :** హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణం

బాబును నమ్మం.. మా నమ్మకం నువ్వే జగన్

'ఇంటింటికీ కేజీ బంగారం.. బెంజి కారు ఇస్తానని చెప్పినా కూడా బాబును నమ్ముతారా?' అని సీఎం జగన్ అడిగారు. దీనికి జనం లేదు లేదంటూ చేతులూపడం గమనార్హం. 2014లో చంద్రబాబు ఇచ్చిన ప్రధాన హామీలను జగన్ చదువుతూ.. 'వీటిని బాబు నెరవేర్చారా?' అంటే లేదని జనం చేతులు అడ్డంగా ఊపుతూ ప్రతిస్పందించారు. 'అటువంటి చంద్రబాబు ఇప్పుడు కొత్త హామీలిస్తే మీరు నమ్ముతారా?' అంటే బాబును మేము నమ్మం అంటూ నినాదాలు చేశారు. మన ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చామని జగన్ చెప్పగా.. సభలో ఉన్నవారు 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

సువర్ణపాలన అందించే మేనిఫెస్టో



అన్ని వర్గాల వారికీ మేలు చేకూర్చే విధంగా వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను రూపొందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి పాలన సాగించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం పైగా అమలు చేశారు. నెలకు రూ.25 వేల కంటే తక్కువ జీతం వచ్చే ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ప్రకటించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిందే. సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలిచి విజయాన్ని అందించాలి.

– విప్పర్తి వేణుగోపాలరావు,
పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి

దేశంలో ఎక్కడా లేని సంక్షేమం



దేశంలో ఎక్కడ లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన జరుగుతోంది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. ఇటువంటి పాలన ఎక్కడా చూడలేదు. కేవలం మన రాష్ట్రంలోనే చూస్తున్నాం. ఇక్కడి పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి. వలంటీర్ వ్యవస్థ వల్లనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు కాకినాడలో మాత్రమే మెడికల్ కాలేజీ ఉండేది. ప్రతి జిల్లాకూ మెడికల్ కాలేజీలు ఉండాలనే లక్ష్యంతో సీఎం జగన్ అమలాపురం, రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేస్తున్నారు.

– రాపాక వరప్రసాదరావు,
అమలాపురం ఎంపీ అభ్యర్థి




వెల్‌కం సర్: సీఎం జగన్‌కు స్వాగతం చెబుతున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మంత్రి, అమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పినిపే విశ్వరూప్, ఎంపీ, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్





సీఎం గారూ.. సుస్వాగతం: సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ముమ్మిడివరం అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ కుమార్, రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం ఎంపీ చింతా అనురాధ



ఇదే మన గుర్తు: సభలో ఫ్యాన్ గుర్తు చూపుతున్న ప్రజలు




మా నమ్మకం నువ్వే జగన్: అభిమాన నేతను కన్నులారా చూసిన వేళ చేతులు ఊపుతూ ప్రజల ఆనందోత్సాహాలు



అభిమాన నేత వెంట జనప్రవాహం: సీఎం జగన్ కాన్వాయ్‌తో కదలి వస్తున్న జనం



జనం జెండా రెపరెపలు: సభలో వైఎస్సార్ సీపీ జెండాలు చేబూనిన జనం

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ బైక్‌కు నిప్పు

మామిడికుదురు: మామిడికుదురు–2 వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుడు వర్ధినేని తులసీ రామ్ (రాము) బైక్‌కు ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. తాను రాత్రి 12 గంటలకు బయటకు వెళ్లి వచ్చి అద్దెకు ఉంటున్న ఇంట్లో నిద్ర పోయానని, బైక్ కాలిపోతుందని కింది పోర్షన్‌లో వారు తనను నిద్ర లేపారని రాము తెలిపారు. ఎవరో వ్యక్తులు కావాలనే తన బైకుకు నిప్పు పెట్టారని, బైక్ సమీపంలో అగ్గి పెట్టె కూడా విడిచి పెట్టి వెళ్లారన్నారు. దీనిపై సోమవారం నగరం పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఎంపీటీసీ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తామని ఎస్సై పి.సురేష్ తెలిపారు.

బైక్ దగ్ధం



త్యాజంపూడిలో దగ్ధమైన పల్సర్ బైక్

దేవరపల్లి: ఎండ తీవ్రతకు దేవరపల్లి మండలం త్యాజంపూడిలో సోమవారం ఓ పల్సర్ బైక్ దగ్ధమైంది. ఉప్పుల సుందరానికి చెందిన పల్సర్ బైక్‌ను తన ఇంటి వద్ద ఉన్న తాటాకు పాకలో ఉంచాడు. ఎండ తీవ్రతకు మంటలు వ్యాపించి బైక్ దగ్ధమైనట్టు సుందరం తెలిపారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు



రుత్తాల కృష్ణ (ఫైల్)

కాట్రేనికోన: మండలంలోని కుండలేశ్వరంలో పుష్కర ఘాట్ వద్ద స్నానం చేసేందుకు వెళ్లిన భక్తుడు రుత్తాల కృష్ణ (62) గోదావరిలో గల్లంతయ్యాడు. కుండలేశ్వరం పుణ్య క్షేత్రంలో వేంచేసి ఉన్న కుండలేశ్వరస్వామిని దర్శించుకోవడానికి కాకినాడలోని రామారావు పేటకు చెందిన రుత్తాల కృష్ణ, భార్య జానకితో పాటు వచ్చారు. ముందుగా దుస్తుల బ్యాగు వద్ద కృష్ణ ఉండగా, అతని భార్య జానకి గోదావరిలో స్నానం చేసి వచ్చారు. అనంతరం కృష్ణ గోదావరిలో స్నానానికి దిగి గల్లంతు కావడంతో అతని భార్య జానకి బోరున విలపించింది. వీరికి ఇద్దరు సంతానం. ఘటనా స్థలానికి కాట్రేనికోన పోలీసులు, స్థానికులు చేరుకుని గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కాట్రేనికోన ఎస్సై బి.నాగేశ్వరరావు తెలిపారు.

అనుబంధం తెగిపోయి..
ఆనందం ఆవిరి..

ఆ ఘోర ప్రమాదం..
ఆశలను చిదిమేసింది..
అనుబంధాలను చెరిపేసింది..
జీవితాలను చిన్నాభిన్నం చేసింది..
ఆ కుటుంబాలకు ఆసరా లేకుండా మార్చింది..
చేయి పట్టుకుని నడిచే పిల్లలకు తండ్రి లేకుండా చేసింది..
కట్టుకున్నవాడిని భార్యకు దూరం చేసింది..
తోడుగా ఉంటాడనుకున్న కుటుంబానికి కుమారుడిని లేకుండా చేసింది.
అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లిలో ఆదివారం అర్ధరాత్రి ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు మిగిలిన వేదన ఇది.




భట్నవిల్లిలో రోడ్డు ప్రమాదాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- పుట్టెడు దుఃఖం మిగిల్చిన పుట్టిన రోజు వేడుక
- భట్నవిల్లిలో ఆటోను ఢీకొన్న లారీ
- మృత్యువులోనూ వీడని స్నేహం
- నలుగురి దుర్మరణం, మరో నలుగురికి తీవ్ర గాయాలు



కొల్లాబత్తుల జతిన్, నెల్లి నవీన్‌కుమార్, వల్లూరి అజయ్, సాపే నవీన్ మృతదేహాలు



రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన ఆటో వద్ద మృతదేహాలు

అమలాపురం రూరల్/ మామిడికుదురు: వారంతా స్నేహితులు... హ్యాపీ హ్యాపీగా సహచరుడి ముందస్తు పుట్టినరోజు వేడుకకు బయలు దేరారు.. జోకులు వేసుకుంటూ సరదాగా గడిపారు.. కేక్ కట్ చేసుకుని సందడి చేశారు.. తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో దారి కాచిన మృత్యువు లారీ రూపంలో వారి ఆనందాన్ని ఆవిరి చేసింది.. అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లిలోని వనువులమ్మ ఆలయం వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో నలుగురు స్నేహితులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం..

మామిడికుదురు మండలం నగరం శివారు కోటమెరక గ్రామానికి చెందిన కొల్లాబత్తుల జతిన్ (26) పుట్టినరోజు సోమవారం కావడంతో ముందస్తు వేడుకలు జరుపుకొనేందుకు స్నేహితులు నిర్ణయించుకున్నారు. మొత్తం ఎనిమిది మంది పుదుచ్చేరి ప్రాంతం యానాంకు నెల్లి నవీన్‌కుమార్ ఆటోలో ఆదివారం రాత్రి 8 గంటలకు బయలు దేరారు. యానాంలో విందు ముగిశాక అర్ధరాత్రి సమయంలో తిరుగు పయనమయ్యారు. భట్నవిల్లి వచ్చేసరికి కాకినాడ వైపు ఒడిశాకు చేపల లోడుతో వెళుతున్న లారీ వారి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో మామిడికుదురు మండలం నగరం శివారు కోటమెరక గ్రామానికి చెందిన సాపే నవీన్ (22), అదే గ్రామానికి చెందిన కొల్లాబత్తుల జతిన్ (26), అదే మండలం పాశర్లపూడికి చెందిన నెల్లి నవీన్‌కుమార్ (27), పి.గన్నవరం మండలం మానేపల్లికి చెందిన వల్లూరి అజయ్ (18) అక్కడికక్కడే చనిపోయారు. మామిడికుదురు మండలం పాశర్లపూడి శివారు కొండాలమ్మ చింతకు చెందిన మల్లవరపు వినయ్‌బాబు (17), అదే గ్రామానికి చెందిన మార్లపూడి లోకేష్ (17), పెదపట్నానికి చెందిన జాలెం శ్రీనివాసరెడ్డి (17), నగరం శివారు పితానివారి మెరక గ్రామానికి చెందిన మాదాసి ప్రశాంత్‌కుమార్ (17)లు తీవ్రంగా గాయపడి అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందులో జాలెం శ్రీనివాసరెడ్డి, మాదిసి ప్రశాంత్‌కుమార్‌ల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

తరుక్కుపోయిన గుండెలు

చేతికందివచ్చిన తమ పిల్లలు మృత్యవాత పడి విగత జీవులుగా పడి ఉండడం చూసి మృతుల తల్లిదండ్రులు, బంధువులు గుండెలవిసేలా విలపించారు. తన కుటుంబానికి దిక్కెవరంటూ జతిన్ భార్య ఆశాదేవి బంధువులను దీనంగా అడుగుతుంటే చూపురుల గుండెలు తరుక్కుపోయాయి. కువైట్‌లో ఉంటున్న తల్లులకు పిల్లల మృత్యు వార్త ఎలా చెప్పాలంటూ నవీన్, అజయ్ కుటుంబీకులు ఆందోళన చెందారు. ప్రమాద వార్త తెలియగానే మృతుల, క్షతగాత్రుల కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ కుటుంబాలన్నీ రెక్కాడితే డొక్కాడని పరిస్థితి. ఆటో నడుపుకొంటూ, ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ నవీన్‌కుమార్, జతిన్ తమ కుటుంబాలను పోషిస్తున్నారు. మిగిలిన వారంతా డిగ్రీ, ఇంటర్మీడియెట్ చదువుకుంటూ భవిష్యత్ కోసం బాటలు వేసుకుంటున్నారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, రూరల్ ఎస్సై శేఖర్‌బాబు ప్రమాద స్థలిని తక్షణమే సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను తక్షణమే ఆస్పత్రికి తరలించి వేగంగా వైద్యం అందేలా సీఐ, ఎస్సైలు శ్రమించారు.

సకాలంలో వైద్యం అందేలా చర్యలు

రోడ్డు ప్రమాదం జరిగిన కొన్ని నిమిషాల తర్వాత తుని నుంచి అమలాపురానికి వస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ స్పందించి ప్రమాద స్థలిలో ఆగి సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. పోలీసు అధికారులతో పాటు ఎమ్మెల్సీ కూడా తక్షణమే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి సకాలంలో వైద్యం అందేలా చొరవ తీసుకున్నారు. దాదాపు రెండున్నర గంటలు ప్రమాద స్థలం, కిమ్స్ ఆస్పత్రిలోనే ఉన్నారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబీకులను ఓదార్చారు.

పుట్టిన రోజునే పరలోకానికి..



కొల్లాబత్తుల జతిన్



విలపిస్తున్న జతిన్ కుటుంబ సభ్యులు

నగరం గ్రామానికి చెందిన కొల్లాబత్తుల జతిన్ (26) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. సోమవారం అతని పుట్టిన రోజు. పుట్టిన రోజు వేడుకకు అంతా సిద్ధం చేసుకున్నాడు. కొత్త దుస్తులు కొనుక్కున్నాడు. సరదాగా స్నేహితులకు పార్టీ ఇచ్చేందుకు ఆదివారం రాత్రి అంతా కలసి బయటకు వెళ్లారు. ఇంతలోనే ప్రమాదం ముంచుకొచ్చి తనువు చాలించాడు. జతిన్‌కు ఆరేళ్ల కిందట వివాహమైంది. అతనికి భార్య ఆశాదేవి, ఐదేళ్ల కుమార్తె ఆత్య, ఏడు నెలల కొడుకు ఉన్నారు. జతిన్ మృతితో భార్య ఆశాదేవి, తండ్రి వెంకటేష్, తల్లి దివ్య కన్నీరు మున్నీరవుతున్నారు. అభం, శుభం తెలియని పిల్లలకు నాన్న ఎక్కడంటే ఏం చెప్పాలంటూ వారు విలపిస్తున్నారు.


ఒక్కగానొక్క కుమారుడి మృతితో..



సాపే నవీన్

నగరం కోటమెరకకు చెందిన సాపే నవీన్ (22) డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. తండ్రి శ్రీనివాసు రోజు కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి రత్న కుమారి కువైట్‌లో ఉంది. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో అతని కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచేసింది. నవీన్ అమ్మమ్మ బత్తుల మేరీరత్నం తన మనవడి వద్దే ఉంటూ అతడిని అల్లారు ముద్దుగా చూసుకుంటోంది. చదువుకుని ఎంతో ప్రయోజకుడవుతాడని ఆశించిన నవీన్ దుర్మరణం చెందడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.


కిరాయికి వెళ్లి.. మృత్యుఒడికి చేరి



నెల్లి నవీన్‌కుమార్

పాశర్లపూడి నెల్లివారిపేటకు చెందిన నెల్లి నవీన్‌కుమార్ (27) అవివాహితుడు. ఐదు నెలల కిందట కొత్త ఆటో కొనుక్కున్నాడు. తండ్రి ట్రక్కు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. నవీన్ కుమార్ తల్లి మంగాదేవి పదేళ్ల నుంచి మస్కట్‌లో ఉంటున్నారు. తండ్రి, కొడుకు ఆటో నడుపుతూ వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. స్నేహితుడి పుట్టినరోజు, ఆటో కిరాయికి వెళ్లిన నవీన్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడం స్థానికులను తీవ్ర విషాదంలోకి నెట్టింది.

సరదాగా వెళ్లి..



వల్లూరి అజయ్

పి.గన్నవరం మండలం మానేపల్లికి చెందిన వల్లూరి అజయ్ (18) ఇంటర్ పూర్తి చేశాడు. తండ్రి శ్రీనివాసరావు నిరుపేద కుటుంబానికి చెందిన వాడు. అతను గల్ఫ్‌లో ఉంటున్నాడు. తల్లి కుమారి ఇటీవల గల్ఫ్ నుంచి వచ్చారు. కొడుకును ఎంతో అల్లారుముద్దుగా చూసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆ కుటుంబంలో రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. అందివచ్చిన కొడుకు స్నేహితుడి బర్త్‌డే పార్టీకి వెళ్లి ఇలా విగత జీవిగా మారతాడని కలలో కూడా ఊహించలేదని ఆమె విలపిస్తున్న తీరు కంటతడి పెట్టించింది.

అభ్యర్థుల లెక్క తేలింది..

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- రాజమహేంద్రవరం ఎంపీ స్థానానికి 12, ఎమ్మెల్యే అభ్యర్థులుగా 83 మంది పోటీ

సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలక ఘట్టం ముగిసింది. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలు పూర్తయ్యాయి. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఖరారయ్యారు. ఎన్నికల్లో పోటీ చేసే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల లెక్క తేలింది. జిల్లాలో రాజమహేంద్రవరం పార్లమెంట్‌కు 12, అలాగే 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు 83 మంది ఎన్నికల కదన రంగంలో నిలిచారు. స్వతంత్ర, వివిధ పార్టీల అభ్యర్థులకు గుర్తులూ కేటాయించారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానానికి బరిలో ఉన్న 12 మంది అభ్యర్థుల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, బీజేపీ తరఫున దగ్గుబాటి పురందేశ్వరి, కాంగ్రెస్ తరఫున గిడుగు రుద్ర రాజులు ఉన్నారు. రాజానగరం అసెంబ్లీ స్థానానికి 12 మంది పోటీలో నిలిచారు. ఇందులో జక్కంపూడి రాజా (వైఎస్సార్ సీపీ), బత్తుల బలరామకృష్ణ (జనసేన) ఉన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి ఏడుగురు పోటీలో నిలవగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ (వైఎస్సార్ సీపీ), గోరంట్ల బుచ్చయ్యచౌదరి (టీడీపీ), నిడదవోలు నియోజకవర్గంలో 12 మంది పోటీలో ఉండగా సిట్టింగ్ ఎమ్మెల్యే జి.శ్రీనివాసులు నాయుడు (వైఎస్సార్ సీపీ), కందుల దుర్గేష్ (జనసేన), కొవ్వూరు నియోజకవర్గంలో 11 మంది పోటీలో ఉండగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు (వైఎస్సార్ సీపీ), ముప్పిడి వెంకటేశ్వరరావు (టీడీపీ) ఉన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 10 మంది ఎన్నికల బరిలో నిలవగా హోం మంత్రి తానేటి వనిత (వైఎస్సార్ సీపీ), మద్దిపాటి వెంకటరాజు (టీడీపీ), అనపర్తి నియోజకవర్గంలో 9 మంది పోటీలో ఉండగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తిసూర్యనారాయణ రెడ్డి (వైఎస్సార్ సీపీ), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (బీజేపీ) తలపడనున్నారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలో 10 మంది పోటీలో నిలిచారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ (వైఎస్సార్ సీపీ), ఆదిరెడ్డి వాసు (టీడీపీ) ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు

- అదే పోలీసుల తొలి బాధ్యత
- పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పోలీసు అబ్జర్వర్ దీపక్‌మిశ్రా తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా విధులు నిర్వహించడమే పోలీసుల తొలి బాధ్యత అని, దీనిపై జిల్లా ఎన్నికల అధికారితో సమన్వయం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్, ఇతర అధికారులతో రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల నిర్వహణలో పోలీసులు కుల, మతం, ప్రాంతం బేధం లేకుండా ప్రవర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల ఖరారు అనంతరం ఓటర్ స్లిప్పుల పంపిణీ, పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియకు చెందిన సమాచారం అందజేసి, తగిన రశీదు తీసుకుంటామని కలెక్టర్ మాధవీలత వివరించారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో రికార్డింగ్, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సజావుగా ఎన్నికలను నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలు, చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని అన్నారు. ఇప్పటి వరకూ రూ.15.50 కోట్లు సీజ్ చేశామన్నారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ ఎన్నికల సంఘ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. అదనపు డీజీపీ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, జిల్లా ఎన్నికల పోలీసు పరిశీలకుడు అరవింద్, వ్యయ పరిశీలకుడు రోహిత్ నగర్, జై.అరవింద్, నితిన్ కురియన్, అదనపు ఎస్పీ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

గుర్తుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం ఆయా అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులో జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ విడిది కార్యాలయం నుంచి రిటర్నింగ్ అధికారులతో ఆమె జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మే 1న కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళిని అనుసరించి ప్రత్యేక కేటగిరీగా పేర్కొన్న వారికి ఇంటి వద్దనే సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. సుమారు 74 శాతం మందికి డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేస్తామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పోలవరం కాలువ సైఫన్‌లో దూకిన యువకుడు?

- ఘటనా స్థలంలో అతడి సెల్‌ఫోన్, బైక్ లభ్యం
- కేసు నమోదు చేసిన నల్లజర్ల పోలీసులు



మర్రి ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి పోలవరం కుడి కాలువ సైఫన్ వంతెనపై నుంచి ఓ యువకుడు దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు అనుమానిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. నబీపేటకు చెందిన మర్రి ప్రవీణ్‌కుమార్ (26) వరి కోత మెషీన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం ప్రసన్నతో అతడికి వివాహమైంది. తల్లిదండ్రులు గంగరాజు, పద్మ, సోదరుడు రవితేజలతో కలసి నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం ప్రవీణ్‌కుమార్ తన సోదరుడికి ఫోన్ చేసి 'చాలా మంది దగ్గర డబ్బు అప్పుగా తీసుకున్నాను. తిరిగి చెల్లించలేక పోయాను. గ్రామంలో తలెత్తుకొని తిరగలేక పోతున్నాను. మీకు చెడ్డపేరు తేవడం ఇష్టం లేక చనిపోతున్నాను' అని చెప్పాడు. 'అనంతపల్లి సైఫన్ బ్రిడ్జి వద్ద నా బైక్, సెల్‌ఫోన్ ఉన్నాయి. వాటిని అమ్మి కొంతమందికైనా అప్పులు తీర్చండి' అంటూ ఫోన్ పెట్టేశాడు. షాక్‌కు గురైన అతని సోదరుడు రవితేజ తన మిత్రులతో సైఫన్ బ్రిడ్జి వద్ద గాలింపు చేపట్టాడు. సోమవారం సాయంత్రం వరకూ మృతదేహం ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా పోలీసులు నమోదు చేసి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.

స్వల్పంగా తగ్గిన వర్జీనియా పొగాకు ధర

దేవరపల్లి: వర్జీనియా పొగాకు ధర తగ్గుముఖం పట్టడంతో రైతులు డీలా పడ్డారు. సోమవారం నిర్వహించిన వేలంలో కిలో గరిష్ట ధర రూ.337 పలికింది. ఎక్కువ బేళ్లకు రూ.333 నుంచి 336 మధ్య రేటు లభించినట్టు రైతులు తెలిపారు. శనివారం నాటి మార్కెట్లో కిలోకు గరిష్ఠ ధర రూ. 341 లభించగా, సగటు ధర రూ. 253.18 పలికింది. అయితే సోమవారం మార్కెట్లో గరిష్ట ధర రూ. 337, సగటు ధర రూ, 257.77 లభించినట్టు పొగాకు బోర్డు రీజినల్ మేనేజరు ఎం.ఆదిశేషయ్య తెలిపారు. దేవరపల్లి వేలం కేంద్రంలో కిలో గరిష్ట ధర రూ. 336, జంగారెడ్డిగూడెం–1 వేలం కేంద్రంలో రూ. 336, జంగారెడ్డిగూడెం–2 వేలం కేంద్రంలో 336, కొయ్యలగూడెం వేలం కేంద్రంలో రూ. 337, గోపాలపురం వేలం కేంద్రంలో రూ.337 పలికినట్టు ఆయన వివరించారు. శనివారం మార్కెట్‌తో పోల్చుకుంటే కిలో గరిష్ట ధర రూ. 4 తగ్గగా, సగటు ధర రూ.కిలోకు రూ. 4 పెరిగినట్టు ఆయన చెప్పారు.

వడగాడ్పులతో అప్రమత్తత అవసరం

కాకినాడ సిటీ: ఏపీ రాష్ట్ర విపత్తుల సంస్థ హెచ్చరికల ప్రకారం మంగళవారం కాకినాడ జిల్లాలోని 18 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. గండేపల్లి, గొల్లప్రోలు, జగ్గంపేట, కాకినాడ రూరల్, కరప, కిర్లంపూడి, కోటనందూరు, ఉప్పాడ, కొత్తపల్లి, పెదపూడి, పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం, సామర్లకోట, తొండంగి, తుని ఏలేశ్వరం మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. సోమవారం కాకినాడ జిల్లాలో గండేపల్లి, ఉప్పాడ, కొత్తపల్లి, ఏలేశ్వరం మండలాల్లో 41 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ప్రజలు వీలైంత వరకూ ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండాలన్నారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.